Manam_30 March 2018




# టీహబ్‌లో అవకతవకలు

## రెండో దశ నిర్మాణంలో అక్రమాలు.. సర్కారుకు 16.7 కోట్ల నష్టం

- 'ఇమేజ్' భవనంలో 5 కోట్ల నష్టం
- 'ఐటీఐఆర్' ప్రణాళిక లోపభూయిష్టం
- వృథాగా ఫ్యాబ్ సిటీలో 712 ఎకరాలు



హైదరాబాద్, మార్చి 29 (మనం ప్రతినిధి): రాష్ట్ర ఐటీ శాఖకు కాగ్ తలంటింది. టీహబ్ రెండో దశ భవన నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వంపై రూ.16.70 కోట్ల ఆర్థిక భారం పడిందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. యువత ఆలోచనలకు రెక్కలు తొడిగే ఉద్దేశంతో టీఆర్ఎస్ ప్రభుత్వం టీహబ్‌కు ఊపిరి పోసిన విషయం తెలిసిందే. టీ హబ్ దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబెటర్‌గా కేటీఆర్ ఎన్నోసార్లు అభివర్ణించారు. ఇందులో 250 అంకుర పరిశ్రమలకు చోటు కల్పించారు. ఇందులో 50 అంకుర పరిశ్రమలు ఇప్పటివరకు ఎదిగాయి. టీ హబ్‌తో భాగస్వామ్యంగా ఉన్న సంస్థలు, అందులో ఎదిగిన సంస్థలు ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆ ప్రాజెక్టు విజయవంతం కావడంతో, టీ హబ్-2కు సన్నాహం చేస్తోంది ప్రభుత్వం. 3 లక్షల 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీ హబ్-2 నిర్మిస్తున్నామని స్వయంగా కేటీఆర్ తెలిపారు. ప్రఖ్యాత కంపెనీలు టీ హబ్‌తో జట్టు కడుతున్నాయని, వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ద్వితీయ శ్రేణీ నగరల్లోనూ టీ హబ్‌ను విస్తరిస్తామన్నారు. అంతేకాదు మహిళా పారిశ్రామిక వేత్తల కోసం ప్రత్యేకంగా విహబ్‌ను తీసుకువచ్చింది. అయితే టీహబ్ వల్ల ప్రభుత్వం నష్టపోయిందని, ఆ ప్రాజెక్టు భవన నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని కాగ్ నివేదిక అక్షింతలు వేసింది.



### తొలిదశలోనూ అవకతవకలు..

టీ హబ్ ఆవిష్కరణ కేంద్రం తొలిదశలోనూ అవకతవకలు ఉన్నట్లు కాగ్ వెల్లడించింది. సబ్సిడీల పద్దు కింద బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల మధ్య పలు సంవత్సరాల్లో పొంతన లేదని పేర్కొంది. ఐటీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్(ఐటీఐఆర్) విషయంలో ప్రణాళికారచన లోపభూయిష్టంగా ఉందన్నది. ఐటీఐఆర్ మొదలు కాకుండా ఉండిపోయిందని, సెమీ కండక్టర్ పరిశ్రమల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఫ్యాబ్‌సిటీ విషయంలో కీలకపాత్ర పోషించాల్సిన రెండు సంస్థలు పరిశ్రమలను ప్రోత్సహించడంలో విఫలమయ్యాయని అందులో పేర్కొంది. పర్యవసానంగా, ఫ్యాబ్ సిటీ కోసం కేటాయించిన 1075 ఎకరాల్లో 712 ఎకరాలు నిరుపయో గంగా ఉన్నాయంది. ఎలక్ట్రానిక్ తయారీ సంస్థల సము దాయ పథకం మార్గదర్శకాల ప్రకారం భాగస్వామ్య సంస్థల నుంచి కనీస పెట్టుబడులను డిపార్ట్‌మెంట్ / తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల కార్పొరేషన్ నిర్ధారించు కోలేకపోయాయని వెల్లడించింది. టీహబ్, ఇన్నోవేషన్ ఇన్ మల్టీమీడియా, యానిమేషన్, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ (ఇమేజ్) భవనాల నిర్మాణా నికి సంబంధించి సలహాదారుల ఎంపిక విషయంలో లోపాలున్నాయని ఆ నివేదికలో తేటతెల్లం చేసింది. వాటివల్ల ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం పడిందని తెలిపింది. ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత చేసిన మార్పుల కారణంగా టీహబ్ రెండో దశ నిర్మాణ సంస్థకు అనుచిత ప్రయోజనం కలిగింది. ఐటీ సంస్థలకు భూమిని ఇవ్వజూపే ముందే కనీస వసతులను నిర్ధారిం చుకోకపోవడం వల్ల గత ఐదేళ్లలో భూమి కేటాయింపులు లేవు. పెట్టుబడులు పెట్టి, ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో ఐటీ సంస్థల సామర్థ్యాన్ని/నిబద్ధతను డిపార్ట్‌మెంట్ నిర్ధారించు కోలేదు. ఐటీ కార్యకలాపాల కోసం కేటాయించిన భూమి వినియోగాన్ని, నిర్ణీత గడువుల ప్రకారం అభివృద్ధిని ధ్రువీకరించుకునే పర్యవేక్షణ బాగా లేదు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో, మండలాల్లో స్టేట్‌వైడ్ ఏరియా నెట్‌వర్క్ వసతుల ఏర్పాటు డిపార్ట్‌మెంట్ ఇంకా చేయాల్సి ఉందని కాగ్ నివేదికలో స్పష్టం చేసింది.

### సామాజిక అభివృద్ధికి ఐటీ ఊతం

**దేశంలోనే మూడో స్థానంలో తెలంగాణ: కాగ్**

ఐటీ రంగంలో లోపాలు ఎత్తి చూపిన కాగ్.. అదీ సమయంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడించింది. తెలంగాణలో ఐటీ రంగాన్ని సామాజిక-ఆర్థిక సత్వర అభివద్ధికి ఊతం ఇచ్చే ఒక చోదక శక్తిగా పరిగణించడం జరుగుతోందని పేర్కొంది. 2014-16 కాలంలో భారతదేశం మొత్తం సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 13 శాతం(రూ.40 వేల కోట్లు)మని కాగ్ నివేదిక నిర్ధారించింది.దేశంలోనే తెలంగాణది మూడో స్థానం. ఐటీ సంబంధిత ఎగుమతుల విషయంలో దేశ సగటు వద్ధిరేటు(పదిశాతం కన్నా ) తెలంగాణ వద్ధి రేటు (13.85) ఎక్కువ. ఐటీ రంగం నేరుగా 4.31 లక్షల మందికి, పరోక్షంగా ఏడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపింది.

### ఐటీ రంగంపై కాగ్ నివేదికలోని ప్రధానాంశాలు

- 2015-16, 2016-17 కాలాల్లో మౌలిక సదుపాయల మీద అయిన ఖర్చులో 60 శాతం కేవలం టీహబ్ నిర్మాణం మీదనే జరిగింది. ఐటీ రంగంలో పెట్టుబడులకు ఊతం ఇచ్చే ఇతర చర్యల మీద అంటే ఐటీ సంస్థలకు ఇవ్వజూపే భూభాగాల్లో కనీస వసతుల అభివృద్ధి వంటివి వెనుకంజ వేశాయి.
- గత ఐదేళ్లలో ఐటీ డిపార్ట్‌మెంట్ 34 సందర్భాల్లో ప్రోత్సహకాలు మంజూరు చేసింది. అందులో 24 కేసులు విద్యుత్ చార్జీల విధింపు విషయంలోనే జరిగింది. వాణిజ్య కేటగిరీని పారిశ్రామిక కేటగిరీగా మార్చేందుకు ఇచ్చినవే. విద్యుత్ కనెక్షన్ కేటగిరీ ఆధారంగా బిల్లులు జారీ అవుతాయి. కాబట్టి ఇలా కేటగిరీ మార్పునకు డిపార్ట్‌మెంట్ బడ్జెట్ ఏమీ అవసరం లేదు.
- 2016-17లో కూడా ప్రోత్సహకాల కోసం రూ. 20 కోట్లను కేటాయించగా, వాటి మీద అయిన ఖర్చు రూ. 0.99 కోటి మాత్రమే. గత కొన్ని సంవత్సరాలుగా సబ్సిడీ పద్దు కింద బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల మధ్య పొంతన లేకపోవడం, డిపార్ట్‌మెంట్ ఈ అంశాన్ని సమీక్షించాలని తెలుపుతోంది.
- ఐటీఐఆర్‌కు రూ. 2,19,440 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేశారు. కానీ ఆ వివరాలను ఆడిట్‌కు అంద జేయలేదు. ఆ పెట్టుబడులు సాధ్యపడని పెట్టుబడులుగా కాగ్ పేర్కొంది.
- ఫ్యాబ్ సిటీ ద్వారా 5.17 లక్షల మందికి ఉపాధి కల్పిస్తానని ప్రభుత్వం యోచించింది. ఫ్యాబ్‌సిటీలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి అవసరమైన పెట్టుబడులను సెమ్ ఇండియా, ఇంటలెక్ట్ ఇంక్ అనే రెండు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. కానీ అవి రెండు కూడా ఆశించిన పెట్టుబడులు తీసుకురావడంలో విఫలమయ్యాయి. ఫలితంగా ఫ్యాబ్‌సిటీకి కేటియించిన 1075 ఎకరాల్లో చాలా భాగం నిపయోగంగా ఉండిపోయింది. 3,016 మందికి మాత్రమే ఉపాధి అవకాశాలు లభించాయి.
- టీ హబ్, ఇమేజ్ భవన నిర్మాణాలకు రూపశిల్పి -సలహాదారు ఎంపిక ప్రక్రియ మొత్తం అవకతవతకలతో కూడుకున్నది. ఇమేజ్ భవనం విషయంలో రూ. 5.04 కోట్ల మేరకు అధిక ఆర్థిక భారం ప్రభుత్వంపై పడింది.
- ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత చేసిన మార్పుల కారణంగా నిర్మాణ సమయంలో టీహబ్ రెండో దశ నిర్మాణ సంస్థకు రూ. 13.11 కోట్ల మేర అనుచిత ప్రయోజనం కలిగింది.
- జరిమానాలు లేకుండానే ఓ సంస్థ భూమిని తిరిగి ఇచ్చేందుకు ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయల కార్పొరేషన్ అనుమతించింది. దీని ఫలితంగా ఆసంస్థకు 13.75 కోట్ల మేర అనుచిత ప్రయోజనం కలిగింది.